క్లుప్తంగా

నర్సింగాపురం గ్రామానికి రాష్ట్రస్థాయి అవార్డు



మదనాపురం: అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ జీవవైవిధ్య నిర్వహణ కమిటీ రాష్ట్ర స్థాయి అవార్డును నర్సింగాపురం పంచాయతీ కార్యదర్శి మోని అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేంటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ సువర్ణ చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు.

కోటిలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల శ్రీకోటిలింగేశ్వరదత్త దేవస్థానాన్ని గురువారం బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ దర్శించుకున్నారు. ఆలయంలో గల శ్రీకోటిలింగేశ్వర స్వామివారికి, ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆయనను శాలువాతో సన్మానం చేసి, అభిషేకం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మొక్కలను సంరక్షించాలి

వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ 2.0 ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని నల్లచెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. అనంతరం జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ, టీఎంసీ, సీఈవోలు, ఆర్పీలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సొంత నిధులతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు



ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో మాజీ వార్డుసభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు రూ.27 వేలు వెచ్చించి తాగునీటి పైప్‌లైన్‌ను గురువారం ఏర్పాటు చేయించారు. పాలకమండలి పదవీ కాలం ముగియడంతో తాగునీటి ఇబ్బందులు తీర్చలేని పరిస్థితి నెలకొనడంతో కాలనీవాసుల బాధను గుర్తించి తన సొంత నిధులు సమకూర్చి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శ్రీనివాసులును అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అమరచింత: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం పట్టణ ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. పట్టణంలోని పది వార్డులతో పాటు చౌరస్తాల్లో సీసీ కెమెరాలు బిగించడం వల్ల దొంగతనాలు, ఘర్షణలు లాంటి ఘటనలు జరిగితే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూర్: జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బహిరంగ సభలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగయాదవ్ కోరారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద బహిరంగసభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వీవీ గౌడ్, స్వప్న, సురేందర్, మల్లేష్, తిరుపతయ్య, శ్రీనివాస్, రాజు, నాగన్న, శశికుమార్, యుగంధర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ‘హనుమాన్’ జయంతి

వనపర్తి టౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూల విరాట్‌కు ఉదయం నుంచే ఆకు పూజ, సింధూర అలంకరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని రామాలయంలో ఆంజనేయ స్వామివారికి అర్చకులు ఆగమశాస్త్ర ప్రకారం పూజలు జరిపించారు. చింతల హనుమాన్ ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

కనులపండువగా ఇరుముడిధారణ

మండలం పాటు హనుమాన్ దీక్షలు చేపట్టిన భక్తులు రామాలయంలో ఇరుముడి పూజలు నిర్వహించారు. ఇరుముడి ధరించిన మాలధారులు పాదయాత్రగా జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనరసింహస్వామి, వీర బ్రహ్మేంద్ర స్వామి, హనుమాన్ టేకిడిలోని బాలాంజనేయ స్వామి ఆలయం, నగరేశ్వర ఆలయాలను దర్శించి, చివరిగా ఇరుముడిని చింతల హనుమాన్ స్వామికి సమర్పించారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో స్వామి వారికి భక్తులు పంచామృతం, తమలపాకులు, నిమ్మకాయల మాల, తులసి మాల, లిల్లీ పూలతో పాటుగా వివిధ రకాల పుష్పాలు, పండ్లతో స్వామివారిని అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి. శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సతీష్, యాపర్ల రామిరెడ్డి, కృష్ణ, బ్రహ్మం పాల్గొన్నారు.

రంగాపురంలో..

వనపర్తి రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పెబ్బేరు మండలంలోని రంగాపురంలో భక్తాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకట్రాములు, దయాకర్‌రెడ్డి, రాంరెడ్డి, మధుసూదన్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



రంగాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు



మూలమళ్లలో..

బుద్దారంలో..

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను గ్రామస్తులు, యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల పాండురంగస్వామి ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకం, తమలపాకు పూజ, అలంకారం, మహామంగళ హారతి తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి శ్రీపాండురంగస్వామి భజన మండలి ఆధ్వర్యంలో భజన, పల్లకీ సేవతో హనుమాన్ విగ్రహంతో గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు.

పామిరెడ్డిపల్లిలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త మన్నెపురెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ఆకు పూజ, అభిషేకం చేశారు. బస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో యాదవరెడ్డి, బుచ్చిరెడ్డి, నర్సింహ, రవిచందర్ రావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుద్దారంలో ర్యాలీ తీస్తున్న భక్తులు



వనపర్తిలో ఇరుమడి ధరించిన మాలధారులు



పామిరెడ్డిపల్లిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

తూకాల్లో జాప్యం.. తడిసిన ధాన్యం

పాన్‌గల్: అకాల వర్షాలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంతో పాటు దావాజిపల్లి, బుసిరెడ్డిపల్లి, శాగాపూర్, తెల్లరాళ్లపల్లి తదితర గ్రామాల్లో ఉన్న ఐకేపీ, సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాలల్లోని ధాన్యం తడిసింది. ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లపై వర్షం నీరు నిలిచింది. ఆయా కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై నిలిచిన నీటిని తొలగించి ధాన్యాన్ని ఆరబెట్టారు. ధాన్యం కాంటా చేయడంలో జాప్యం చేస్తుండటంతోనే ఈ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరోపక్క కాంటా చేసిన ధాన్యం బస్తాలను తరలించడానికి సక్రమంగా లారీలు రావడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి, గోదాంలకు తరలించాలని రైతులు కోరుతున్నారు.



పాన్‌గల్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కుప్పపై నిలిచిన వర్షపు నీరు

ధాన్యం త్వరగా కాంటా చేయాలి



దావాజిపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాంటా చేయడంలో జాప్యం లేకుండా చూసి, రైతుల ఇబ్బందులను తొలగించాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని దావాజిపల్లిలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా తేమ శాతం, లారీల కొరత పేరుతో జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తాలు పేరుతో క్వింటాల్‌కు రెండు నుంచి మూడు కిలోల తరుగు తీయడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. తాలు పేరుతో జరుగుతున్న మోసాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

30న ‘ఉపాధి’ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

అమరచింత: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో గురువారం ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు 8 వారాలుగా కూలీ డబ్బులను చెల్లించడం లేదన్నారు. అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పనిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 చెల్లించాలన్నారు. ఉపాధి సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు అందించడం లేదని, ఇది ప్రభుత్వ తీరుకు వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, బాలన్న, లింగమ్మ, తిరుపతిరెడ్డి, భాగ్యమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అజయ్

ప్రతిష్ఠాపనోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠామహోత్సవానికి నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు గురువారం మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. జూన్ 3 నుంచి 5 వరకు నూతన ఆలయాలు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలు ప్రముఖ వేదపండితుల మంత్రోచ్ఛరణలతో జరుగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, నిర్వాహకులు మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, ఆనంద్, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము, సాయిరాఘవ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీహరికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకోం

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, వారి హక్కులను కాలరాస్తోందని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు హన్మంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మండిపడ్డారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డులో టీయూసీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడి వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ బడుగుల నడ్డివిరుస్తోందని దుయ్యబట్టారు. నోట్ల రద్దు చేసి సంపన్నులకు మేలు చేశారని, నల్లధనాన్ని తెల్లగా మార్చుకున్నారని ఆరోపించారు. కేంద్రం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు నష్టం చేకూరుస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చెన్నయ్య, భగవంతు, కొండన్న, లూథర్, మోహన్, వెంకట్రాములు, దేవన్న, వెంకటన్న, కిరణ్, సురేందర్, శ్రీరాములు, హమాలీలు ఉన్నారు.



మాట్లాడుతున్న హన్మంతు

బ్యాంకును మోసం చేసిన మహిళపై కేసు నమోదు

పాన్‌గల్: బ్యాంకును మోసం చేసిన ఘటనలో మహిళపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన అంజనమ్మ పాన్‌గల్ ఎస్‌బీఐలో 14 ఫిబ్రవరి 2024న జేసీబీ కొనుగోలు పేరుతో రూ.29.40 లక్షల రుణం తీసుకుంది. రుణం తీసుకున్న మహిళ కొద్ది నెలలు మాత్రమే ఈఎంఐలు చెల్లించి, మిగతా కంతులు చెల్లించడం లేదు. ఈఎంఐలు చెల్లించకుండా, జేసీబీ వాహనాన్ని బ్యాంకు రికవరీ అధికారులకు అప్పగించకుండా బ్యాంకును మోసం చేశారని ఎస్‌బీఐ మేనేజర్ నగేష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

8 సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి అప్పగించినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. మండలానికి చెందిన కె.మధు, వినీత్‌కుమార్, బదుగని నర్సింహులు, కాగితాల వెంకటేష్, శివకుమార్, కావలి నర్సింహ, మండ్ల మోహన్‌కుమార్, శ్రీనివాసులు ఫోన్‌లు పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రూ.1.44 లక్షల విలువ చేసే ఫోన్లను రికవరీ చేసి బాధితులకు గురువారం అప్పగించినట్లు పేర్కొన్నారు.

భాగ్యరెడ్డివర్మ ఆశయ సాధనకు పాటుపడాలి



జిల్లా కేంద్రంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

వనపర్తి: మాదారి భాగ్యరెడ్డివర్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆర్డీఓ సుబ్రమణ్యం అన్నారు. భాగ్యరెడ్డివర్మ 138వ జయంతిని పురస్కరించుకొని గురువారం ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరఫున అధికారికంగా వేడుకలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆర్డీఓతో పాటు, ఎస్సీ కార్పొరేష్ ఈడీ మల్లికార్జున్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, సంఘ నాయకులు భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎండీ అఫ్జల్, గంధం నాగరాజు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో..

వనపర్తి టౌన్: దళితుల అభ్యున్నతి, బాల్యవివాహాల నిర్మూలనకు రాజీలేని పోరాటం చేసిన భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారామ్‌ప్రకాశ్, డీఈఈ యూనుస్, ఆర్వో అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మెప్మా బాలరాజు, యువరాజు, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, గిరిరాజాచారి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడి



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మురళీధర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రైతులు రసాయన ఎరువులకు బదులుగా పచ్చిరొట్టె ఎరువులు వాడటం వలన మంచి దిగుబడి రావడంతో పాటుగా భూమి సాంద్రత పెరుగుతుందని మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. మండలానికి వచ్చిన జీలుగ విత్తనాలను గురువారం మండలంలోని సింగిల్‌విండో, ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు, అక్కడి నుంచి రైతులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి వచ్చిన మొత్తం 170 బస్తాల జీలుగ విత్తనాలను సింగిల్‌విండో కు 50 బస్తాలు, ఆగ్రో రైతు సేవాకేంద్రం, సోళీపురం గ్రామానికి 50 బస్తాలు, ఆగ్రో రైతు సేవాకేంద్రం 3 కు 25 బస్తాలు, 4 కు 25 బస్తాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రం మానాజీపేటకు 20 బస్తాలు పంపామన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో కార్యదర్శి ప్రకాష్, ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొడంగల్ ఎత్తిపోతలకు భూత్పూర్ నీళ్లా..?

అమరచింత: కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూత్పూర్ రిజర్వాయర్ నీటిని తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ఇక్కడి రైతులు చూస్తూ ఊరుకోరని, పనులు అడ్డుకుంటామని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి నీరు అవసరం అనుకుంటే హంద్రీ నుంచి తీసుకెళ్లాలని సూచించారు. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, అమరచింత, ఆత్మకూర్, మాగనూర్, మక్తల్, ఉట్కూర్ మండలాల రైతులకు సాగునీటిని అందిస్తూ ఈ ప్రాంత భూగర్భ జలాలు పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతున్న భూత్పూర్ రిజర్వాయర్‌ను ఎండమావిగా చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి డీపీఆర్ లేదని, ఎలాంటి అనుమతులు రాకముందే ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనుల కోసం రూ.100 కోట్లు కేటాయించడం శోచనీయం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో నిర్మించిన చంద్రగఢ్ ఎత్తిపోతలు పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ మాజీ అధ్యక్షుడు ఎస్ఏ రాజు, రమేష్ ముదిరాజ్, రవికుమార్‌యాదవ్, బాలరాజ్, జింకరవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

చేనుకు ‘చెరువు’ మట్టి



చిన్నంబావి శివారులో పొలంలో వేసిన నల్లమట్టి

- నల్లమట్టితో అధిక లాభాలు
- అధిక మోతాదు మంచిది కాదంటున్న అధికారులు
- ఎకరాకు 20 నుంచి 25 టన్నులు మేలు

చిన్నంబావి: పొలానికి సత్తువ తెచ్చేందుకు చెరువులోని ఒండ్రుమట్టి సమర్థవంతంగా పనిచేస్తుందని వ్యవసాయాధికారులు సూచించారు. ప్రస్తుతం విత్తనం వేయడమే ఆలస్యం పంటకు రైతులు విపరీతంగా ఎరువులు వాడుతున్నారు. అధిక దిగుబడుల కోసం ఎరువులు వేస్తే చీడపీడలు ఆశిస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు శక్తివంతమైన పురుగు మందులను పిచికారీ చేస్తుండడంతో భూసారం కోల్పోతుంది. పంట పొలాల్లో సారం రోజురోజుకూ తగ్గిపోవడంతో పాటు సూక్ష్మ పోషకాలు, భూమికి మేలు చేసే కీటకాలు చనిపోతున్నాయని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా రైతులు భూమి సహజ గుణాన్ని కోల్పోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా పోషక విలువలు కలిగిన చెరువు, మండల సమీపంలో ఉన్న కృష్ణానదిలో నల్లమట్టిని పంటపొలాల్లో వేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో..

మండలం జూరాల చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో ఒక పంటకు చివరి వరకు సాగునీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయంగా నల్లమట్టిని వేయడం ద్వారా రెండో పంటకు కొంత మేలు కలుగుతుందని రైతుల భావన. ప్రతి ఏడాది పొలాలకు నల్లమట్టిని పరుస్తారు. దీంతో ఆయా భూముల్లో రెండో పంటగా మినుములు, శనగలు, జొన్న వంటి పంటలను రైతులు సాగు చేసి ఆదాయాన్ని పొందుతారు. నల్లమట్టి ఎక్కువ వేయడం ద్వారా నేలలో తేమశాతం ఎక్కువగా ఉంటుందని, నేల సైతం దిబ్బ పారుతుందని దీంతో పంట వేర్లు లోపలికి వెళ్లకుండా అడ్డు పడుతుంది. నల్లమట్టిలో అధిక మొత్తంలో పోషకాలు ఉండటం వలన కలుపు మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. ఎక్కువ మోతాదులో నల్లమట్టి వాడటం వల్ల భూమి సారం కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఎకరాకు 20 నుంచి 25 టన్నుల మట్టిని వాడుకోవాలని సూచిస్తున్నారు.

పోషకాలు మెండు

మండలంలోని అధిక ప్రాంతం కృష్ణానది పరివాహక ప్రాంతం కావడంతో ఇక్కడ సాధారణంగా నల్లమట్టి విపరీతంగా దొరుకుతుంది. దీంతో రైతులు ప్రతి ఏటా నదిలో నీరు ఎండిపోయిన తర్వాత నల్లమట్టిని పంట పొలాల్లో వేసుకుంటూ భూసారాన్ని పెంచుతున్నారు. ఈ మట్టిలో సహజంగానే నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు పోషకాలు విరివిగా ఉంటాయి. అంతే కాక పొలంలో తేమ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చు. నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పంటలకు మేలు కలుగుతుంది. సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్, కాఫర్, బోరాన్ వంటివి పంటలను చీడపీడల బారి నుంచి కాపాడుతాయి.

ఏరు మట్టితో ప్రయోజనం



కృష్ణానదిలో తమ పొలం ముంపునకు గురైంది. అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన పొలాల్లో రాళ్లు ఉండటంతో వాటిని తొలగించి భూమిలో నల్లమట్టి వేసి సాగులోకి తీసుకొచ్చాం. దీంతో అధిక దిగుబడులు వచ్చాయి.

– తూంకుంట శ్రీనివాసులు, పెద్దమారు